సాక్షి

భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 2 । మార్చి । 2023



పగిడిద్దరాజు జాతర షురూ..

మేడారం సమ్మక్క భర్త, యాపలగడ్డ గ్రామానికి చెందిన అరెం వంశీయుడు పగిడిద్దరాజు జాతర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. 8లో



'బండ' మరింత భారం

గ్యాస్ సిలిండర్ ధరను కేంద్రం ఒక్కసారిగా రూ.50 పెంచడంతో వినియోగదారులపై మరింతగా భారం పడనుంది. 8 లో



వాతావరణం

జిల్లాలో గురువారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. రాత్రి పూట వాతావరణం కొంత చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వైభవోపేతంగా రామయ్య నిత్య కల్యాణం



నిత్యకల్యాణంలో స్వామి వారు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువు దీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం జరిపారు.

సామాన్యుల నడ్డి విరిచిన కేంద్రం

- గ్యాస్ ధర పెంపుపై మంత్రి పువ్వాడ



ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధర రూ.50 పెంచడం ద్వారా సామాన్యుల నడ్డి విరిచిందని రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆరోపించారు. ఇప్పటికే చాలీచాలని జీతాలతో కుటుంబాన్ని నెట్టుకొస్తుంటే వంట గ్యాస్ ధర పెంచడం సరికాదని పేర్కొన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడినప్పుడు రూ.460 ఉన్న సిలిండర్ ధర ఇప్పుడు రూ.1,100 దాటిందని తెలిపారు. రానున్న మహిళా దినోత్సవం సందర్భంగా సిలిండర్ ధరలు పెంచిన ప్రధాని మోదీ వారికి బహుమతి ఇచ్చారని మంత్రి ఎద్దేవా చేశారు.

క్రీడామైదానాలు త్వరగా పూర్తిచేయాలి



క్రీడామైదానాన్ని పరిశీలిస్తున్న విద్యాలత

ఇల్లెందురూరల్: పల్లెల్లో చేపడుతున్న క్రీడా మైదానాల పనులు త్వరితగతిన పూర్తిచేయాలని జెడ్పీ సీఈఓ విద్యాలత ఆదేశించారు. మండలంలోని సుదిమళ్ల, సుభాష్‌నగర్ గ్రామాల్లో క్రీడా మైదానాలు, నర్సరీ, పల్లె ప్రకృతి వనాలను బుధవారం ఆమె పరిశీలించారు. నర్సరీలలో మొక్కల సంరక్షణపై పంచాయతీ కార్యదర్శులు నిరంతరం దృష్టి సారించాలని సూచించారు. ప్రస్తుతం ఎండలు మండుతున్నందున పల్లెప్రకృతి వనాలలో మొక్కలు వాడిపోకుండా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఈసీ శంకర్, పంచాయతీ కార్యదర్శులు రజనీకాంత్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందులో 135 శాతం బొగ్గు ఉత్పత్తి



మాట్లాడుతున్న జీఎం షాలేమురాజు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో ఫిబ్రవరిలో 135 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించామని జీఎం షాలేమురాజు తెలిపారు. బుధవారం ఆయన ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. ఫిబ్రవరిలో 2.70 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం కాగా, 3.63 లక్షల టన్నులు ఉత్పత్తి చేసినట్లు చెప్పారు. ఈ ఏడాది ఇప్పటివరకు 41.92 లక్షల టన్నులకు గానూ 106 శాతంతో 44.45 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేశామని వివరించారు. రైలు మార్గం ద్వారా 3.14 లక్షల టన్నులు, రోడ్డు మార్గం ద్వారా 0.86 లక్షల టన్నులు, ఆర్‌సీహెచ్‌పీ ద్వారా 1.29 లక్షల టన్నులు.. మొత్తం 5.29 లక్షల టన్నులు బొగ్గు బట్వాడ చేశామని వివరించారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తికి కృషి చేయాలని అధికారులు, ఉద్యోగులకు సూచించారు. సమావేశంలో ఎస్‌ఓటుజీఎం మల్లారపు మల్లయ్య, ఏజీఎం(ఐఈడీ) ఎం.గిరిధర్‌రావు, ఎం.టీ పర్సనల్ సాయి స్వరూప్, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఐడీఓసీలో అవినీతి కథ!

కలెక్టరేట్‌లో ఔట్‌సోర్సింగ్ నియామకాలకు గ్రీన్ సిగ్నల్

- పోస్టుల భర్తీకి టెండర్ల ఆహ్వానం
- ఈ ప్రక్రియలో నిబంధనలు బేఖాతర్
- ఉద్యోగాల కల్పన పేరుతో సొమ్ము కాజేసే ప్రణాళిక
- అవినీతిపరులకు అండగా ఓ అధికారి ?



కొత్తగూడెంలోని ఐడీఓసీ కార్యాలయం

సాక్షిప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఇటీవల జిల్లా కార్యాలయాల సమీకృత భవనం (ఐడీఓసీ) ప్రారంభమైంది. కలెక్టర్‌తో పాటు అన్ని కీలక విభాగాల అధికారులు ఇక్కడి నుంచే పని చేస్తున్నారు. సువిశాల ప్రాంగణంలో కట్టిన ఈ కార్యాలయ నిర్వహణకు సిబ్బంది అవసరమయ్యారు. ఈ మేరకు గార్డెనర్, స్వీపర్, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, సూపర్‌వైజర్ తదితర మొత్తం 28 మంది సిబ్బందిని ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించాలని నిర్ణయించారు. ఇందుకోసం ఫిబ్రవరి 14న టెండర్లు పిలిచారు. 28 మంది సిబ్బందికి ప్రతీ నెల జీతభత్యాలుగా రూ.4.14లక్షలు చెల్లించాల్సి ఉంటుందని, ఈ సేవలు అందించినందుకు పని దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు రూ.4.14 లక్షలపై 2.9 శాతం కమీషన్ అందుతుందని టెండర్‌లో పేర్కొన్నారు. అంటే పని దక్కించుకున్న కాంట్రాక్టర్ 28 మంది సిబ్బందిని నియమించి, వారి కార్మిక హక్కులను పరిరక్షిస్తూ నెల జీతంగా రూ.4.14 లక్షలు చెల్లించాలి. ఇందుకు గాను కాంట్రాక్టర్ సుమారు రూ.12 వేలు కమీషన్ పొందే అవకాశం ఉంటుంది.

జీతంతో పని లేదు..

నిబంధనల ప్రకారం మానవ వనరుల భర్తీకి సంబంధించిన టెండర్లలో ప్రభుత్వం సూచించిన మొత్తం కంటే తక్కువకు కోట్ చేసేందుకు వీలు లేదు. అలా చేస్తే కార్మికుల జీతభత్యాలు తగ్గిపోతాయి. కాంట్రాక్టర్‌కు అందే కమీషన్‌పై మాత్రమే ఎక్కువ లేదా తక్కువకు టెండర్ కోట్ చేయాల్సి ఉంటుంది. కానీ ఐడీఓసీలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది నియామక టెండర్‌లో చిత్రవిచిత్రాలు చోటు చేసుకున్నాయి. మొత్తం 18 మంది కాంట్రాక్టర్లు ఈ టెండర్‌లో పాల్గొనగా కొందరు రూ.4.14 లక్షల బదులు కేవలం రూ.1.40 లక్షలకే తాము ఈ పని చేస్తామంటూ ముందుకొచ్చారు. ఇంత తక్కువ ధేటుకు కోట్ చేయడమేంటని అధికారులు ప్రశ్నించగా తమ కుటుంబంలో చాలా మంది ఖాళీగా ఉంటున్నారని, వాళ్లకు ఓ పని కల్పిస్తే చాలని, జీతం విషయంలో పట్టింపులు ఏమీ లేవని సదరు కాంట్రాక్టర్ బదులిచ్చినట్టు సమాచారం.



అసలు కథ ఇదీ..

ఐడీఓసీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరుతో టెండర్ ప్రక్రియ ప్రారంభమైంది మొదలు కొందరు కాంట్రాక్టర్లు అవినీతికి తెర లేపారు. 'కలెక్టరేట్(ఐడీఓసీ)లో ఔట్ సోర్సింగ్ పద్ధతిన ఉద్యోగం ఇప్పిస్తాం. భవిష్యత్‌లో పర్మనెంట్ అయ్యే చాన్స్ ఉంది. బంగారం లాంటి అవకాశం. వదులుకుంటే మళ్లీ రాదు' అంటూ నిరుద్యోగులకు వల వేయడం మొదలెట్టారు. తమకు తెలిసిన వాళ్ల ద్వారా ఉద్యోగార్థుల నుంచి రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు వసూలు చేయడం ప్రారంభించారు. ఇలా తెర వెనుక నిరుద్యోగుల నుంచి రూ.లక్షల్లో బేరం మొదలెట్టారు.

నిబంధనలకు నీళ్లు..

అనుభవం కలిగి, ఎంప్యానెల్ లిస్టులో ఉన్న కాంట్రాక్టర్లకే నియామకాల భర్తీ టెండర్లలో పాల్గొనే అర్హత కల్పించాలి. కానీ ఎంప్యానెల్ నిబంధనను పూర్తిగా పక్కన పెట్టారు. అంతేకాదు.. టెండర్‌లో పాల్గొనే కాంట్రాక్టర్లు దరఖాస్తుతో పాటు ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఈఎండీ)గా రూ.లక్ష డీడీ రూపంలో జత చేయాలి. అలా చెల్లించని టెండర్ దరఖాస్తులను తిరస్కరించాలి. కానీ ఈఎండీ కట్టని వాళ్ల దరఖాస్తులను కూడా పరిశీలనలోకి తీసుకున్నారు. ఇలా అనుభవం లేకపోయినా, నిబంధనలు పాటించకపోయినా కొందరు కాంట్రాక్టర్ల దరఖాస్తులు పరిశీలనలోకి రావడం వెనుక గజకర్ణ గోకర్ణ, టక్కుటమారా ప్రక్రియలు నడిచినట్టు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఏం జరిగిందంటూ ఆరా..

ఎవరి ప్రయోజనాలు ఆశించి టెండర్లలో నిబంధనలు మార్చారనే సందేహాలు తలెత్తుతున్నాయి. అర్హతలు, అనుభవం లేని వారిని ఈ టెండర్ల ప్రక్రియలో పాల్గొనే అవకాశం కల్పించడం వెనుక 'మూటల వ్యవహారం' నడిచిందనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఔట్ సోర్సింగ్ కార్మికులు ఎటుపోతే ఎంటీ..? ముట్టాల్సింది ముట్టిందా లేదా ? కాంట్రాక్టర్ హ్యాపీయా కాదా అన్నట్టుగా ఓ కీలక అధికారి చక్రం తిప్పినట్టు కలెక్టరేట్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో విషయం బయటకు పొక్కకుండా ఈ మొత్తం ప్రక్రియను హోల్డ్‌లో పెట్టి, తెర వెనుక ఏం జరిగిందనే అంశంపై ఆరా తీస్తున్నారు.

మౌలిక సౌకర్యాలు కల్పిస్తాం

- తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో మొబైల్ ఆస్పత్రికి అనుమతి ఇవ్వాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అనుదీప్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఆస్పత్రుల్లో మౌలిక సౌకర్యాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ అనుదీప్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక నిధుల (స్పెషల్ సెంట్రల్ అసిస్టెన్స్) మంజూరు, వినియోగం, పనుల పురోగతి తదితర అంశాలపై బుధవారం ఇంటెలిజెన్స్ నోడల్ అధికారి ప్రభాకర్ హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుదీప్ మాట్లాడుతూ.. తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు వైద్యసేవలు మరింత చేరువ చేసేందుకు మొబైల్ ఆస్పత్రి ఏర్పాటుకు అనుమతించాలని కోరారు. చర్ల మండలంలో కొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పూసుగుప్ప గ్రామం దూరంగా ఉందని, అక్కడి ప్రజలకు పీహెచ్‌సీకి రావాలంటే ఇబ్బంది పడుతున్నారని, మొబైల్ ఆస్పత్రితో ఇలాంటి అనేక గ్రామాలకు లబ్ధి చేకూరుతుందని వివరించారు. తెలంగాణతో పాటు ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు వైద్యసేవల నిర్వహణకు ఆస్పత్రుల్లో మౌలిక సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఇల్లెందు, భద్రాచలం వైద్యశాలల్లో మాతాశిశు సంరక్షణ చర్యల కోసం పరికరాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. భద్రాచలం ఆస్పత్రిలో కంటివైద్యులున్నా పరికరాలు లేక కంటి ఆపరేషన్లు చేయలేకపోతున్నామని, అందుకు అవసరమైన పరికరాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. చర్ల, దుమ్ముగూడెం మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారుల సౌలభ్యం కోసం డిజిటల్ పరికరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. చర్ల మండలంలో అటవీ అనుమతులు రాకపోవడంతో నిలిచిపోయిన రహదారుల నిర్మాణానికి అనుమతుల కోసం అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్‌కు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. సమావేశంలో ఓఎస్‌డీ అనంత రామకృష్ణ, నళినీకుమార్ పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం

'డయల్ యువర్ ఎస్పీ'లో డాక్టర్ వినీత్



ప్రజల సమస్యలు ఫోన్ ద్వారా వింటున్న ఎస్పీ వినీత్

కొత్తగూడెంటౌన్: ప్రతీ నెల 1వ తేదీన నిర్వహించే డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమానికి ఫోన్ చేసిన బాధితుల సమస్యలు పరిష్కరించి, వారికి సత్వర న్యాయం జరిగేలా చూస్తామని ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు. తన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన 'డయల్ యువర్ ఎస్పీ'కి జిల్లా నలుమూలల నుంచి 17 మంది ఫోన్ చేసి తమ సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా వినీత్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి ఇది మంచి అవకాశమని, ఇలాంటి వేదికలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కాగా, ఈ 17 మంది సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. భూ తగాదాలు, వ్యక్తిగత, కుటుంబ సమస్యలపై ఎక్కువ మంది ఫిర్యాదు చేశారని తెలిపారు.

ఆటో డ్రైవర్లు.. రెండో పోలీసులు..

పాల్వంచ : ఆటో డ్రైవర్లు అనధికారికంగా పోలీస్ పాత్ర పోషిస్తుంటారని, వారు, తాము వేసేది ఖాకీ డ్రెస్సేనని ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు. స్థానిక హెచ్ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం శ్యామలా గోపాల్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ నల్లా సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో 101 మంది ఆటో డ్రైవర్లకు ఉచితంగా రూ.5 లక్షల బీమా పాలసీ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. చిన్న పిల్లలను స్కూల్‌కు దింపడం నుంచి పెద్ద వారి వరకు ఏ సమయంలోనైనా ఆటోవాలాలు ప్రజలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తుంటారని అన్నారు. ఎక్కడ ఏ చిన్న అనుమానిత విషయం కనిపించినా అనేక సార్లు పోలీస్‌ల దృష్టికి తీసుకెళ్లి వారి బాధ్యతను నెరవేరుస్తుండడం అభినందనీయమన్నారు. నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తూ మంచి పేరు సాధించుకోవాలని సూచించారు. అనంతరం నల్లా సురేష్ రెడ్డి మాట్లాడుతూ శ్యామలా గోపాలన్ సొసైటీ ఆధ్వర్యంలో అనేక సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులో మరింత సామాజిక సేవ కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. కార్యక్రమంలో ఇండస్ బ్యాంక్ అధికారి చైతన్య, డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి, డాక్టర్ నవీన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, తుమ్మల శివారెడ్డి, సందుపట్ల శ్రీనివాస రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, నాగచైతన్య తదితరులు పాల్గొన్నారు.

భక్తులు మెచ్చేలా 'నవమి' ఏర్పాట్లు

- కొత్తగూడెం, భద్రాచలంలో టికెట్ల విక్రయ కేంద్రాలు
- పోస్టల్, మీసేవా కేంద్రాల ద్వారా ప్రసాదాలు
- ఆర్‌డీఓ రత్నకళ్యాణి వెల్లడి



మాట్లాడుతున్న ఆర్‌డీఓ రత్నకళ్యాణి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఈ నెల 30, 31 తేదీల్లో జరగనున్న శ్రీరామనవమి, పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాల వీక్షణకు వచ్చే భక్తులు మెచ్చేలా ఏర్పాట్లు చేయాలని ఆర్‌డీఓ రత్నకళ్యాణి అన్నారు. ఉత్సవ ఏర్పాట్లపై తన చాంబర్‌లో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉత్సవాలు నిర్వహించే మిథిలా స్టేడియంలో సెక్టార్ల ప్రణాళిక పక్కాగా ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో టికెట్ల విక్రయం గురించి భక్తులకు తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. టికెట్ల కొనుగోలుకు కొత్తగూడెం, భద్రాచలం ఆర్‌డీఓ కార్యాలయాల్లో కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోస్టల్, మీసేవా కేంద్రాల ద్వారా భక్తులకు స్వామివారి ప్రసాదాలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గోదావరి వద్ద గజ ఈతగాళ్లను, నాటు పడవలను సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు భక్తులకు మజ్జిగ, తాగునీరు సరఫరా చేయాలని, తినుబండారాలు అధిక ధరలకు విక్రయించకుండా చూడాలని అన్నారు. కలెక్టర్ సలహాలు, సూచనలు పాటిస్తూ ఈనెల 25 నాటికి ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీ డీఈ హరిలాల్, ఎక్సైజ్ అధికారి రఫీ మునిషా బేగం, ఏడీఎంహెచ్ఓ రాజ్‌కుమార్, అగ్నిమాపక అధికారి శ్రీనివాస్, ఆర్టీసీ డీఎం రామారావు, ఇరిగేషన్ డీఈ మధుసూదన్ రావు, మిషన్ భగీరథ ఈఈ శ్రీనివాసరావు దేవస్థానం ఈఈ రవీందర్, తహసీల్దార్లు శ్రీనివాస్ యాదవ్, భగవాన్ రెడ్డి పాల్గొన్నారు.

పోలీస్ అధికారుల నంబర్లు మార్పు



కొత్తగూడెంటౌన్: జిల్లాలోని పోలీస్ అధికారులకు ప్రభుత్వం కొత్త నంబర్లు కేటాయించింది. ప్రస్తుతం వాడుతున్న సిమ్‌లకు బదులు కొత్తగా ఎయిర్‌టెల్ సిమ్‌లను అందించింది. నంబర్ల వివరాలు ఇలా ఉన్నాయి.

ఎస్పీ డాక్టర్ వినీత్	87126 82000
భద్రాచలం ఏఎస్పీ పంకజ్ పరితోష్	87126 82004
కొత్తగూడెం డీఎస్పీ	87126 82005
పాల్వంచ డీఎస్పీ	87126 82008
మణుగూరు డీఎస్పీ	87126 82006
ఇల్లెందు డీఎస్పీ	87126 82007
షీటీం సీఐ	87126 82129
షీటీం ఎస్సై	87126 82131
కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ	87126 82029
భద్రాచలం ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ	87126 82109

యువతను ఐక్యం చేయడమే లక్ష్యం



గిరిజన యువతతో సీఆర్‌పీఎఫ్ అధికారులు

భద్రాచలంటౌన్: అన్ని ప్రాంతాల గిరిజన యువతను ఐక్యం చేయడమే జర్నీ టు యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ లక్ష్యమని సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ కమాండెంట్ ప్రశాంత్‌ధర్ తెలిపారు. భద్రాచలం సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్, నెహ్రూ యువ కేంద్ర(ఎన్‌వైకే) ఖమ్మం ఆధ్వర్యంలో భద్రాచలం ఏజెన్సీ ప్రాంతానికి చెందిన 40 మంది యువకులు వారణాసిలో జరిగిన 14వ గిరిజన యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారణాసి, ముంబై నగరాలను సందర్శించి తిరిగి భద్రాచలం వచ్చిన సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రశాంత్‌ధర్ మాట్లాడారు. వివిధ ప్రాంతాల గిరిజనుల సంస్కృతి, భాష, జీవన విధానం, విద్యా పద్ధతులు ఇక్కడి యువతకు అర్థమయ్యేలా అవగాహన కల్పించినట్లు తెలిపారు. యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమంలో గెలుపొందిన యువతకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమల్వీర్ యాదవ్, డిప్యూటీ కమాండెంట్ సింగరవేల్, ఎస్ఎంఓ విజయ్ కిషోర్ రెడ్డి, రాజ్‌కుమార్, వీరస్వామి, అన్వేష్, ఖమ్మం, వరంగల్ యువజన అధికారులు పాల్గొన్నారు.

బడ్జెట్ ప్రతిపాదన ఆమోదించేనా ?

ఇల్లెందు మున్సిపాలిటీలో పట్టువీడని అసమ్మతి కౌన్సిలర్లు



ఇల్లెందు మున్సిపల్ కార్యాలయం

ఇల్లెందు: మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశాలకు వేళయింది. అయితే ఈ దఫా బడ్జెట్ సమావేశానికి ముందే ఇల్లెందులో అసమ్మతి పోరు తారా స్థాయికి చేరడంతో బడ్జెట్‌కు ఆమోదం లభిస్తుందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కలెక్టర్ అనుదీప్ జిల్లాలోని నలుగురు మున్సిపల్ కమిషనర్లతో బుధవారం సమావేశం నిర్వహించి మున్సిపల్ బడ్జెట్ ఆమోదం పొందాలని ఆదేశించారు. అందుకు తగిన సలహాలు, సూచనలు చేశారు. ఇల్లెందు మున్సిపాలిటీ నుంచి కమిషనర్ అంకుషావలీ హాజరై బడ్జెట్ సమావేశంలో ప్రతిపాదించాల్సిన అంశాలపై చర్చించారు. ఈ దఫా సుమారు రూ. 40 కోట్లతో బడ్జెట్‌ను ప్రతిపాదించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే మున్సిపల్ సమావేశం నిర్వహిస్తే అసమ్మతి కౌన్సిలర్లు పట్టు వీడి సహకరిస్తేనే ఆమోదం లభించే అవకాశం ఉంది. ఇప్పటివరకైతే ఆయా కౌన్సిలర్లు పట్టు మీద ఉండగా, చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు కూడా అంతే బెట్టు మీద ఉన్నారు. ఇలా ఇరు వర్గాల వారి మధ్య ఎమ్మెల్యే హరిప్రియ నలిగిపోతున్నారు.

అధికారులను టార్గెట్ చేయనున్న అసమ్మతివాదులు ?

మున్సిపాల్టీలో అధికార పక్షంలో రెండు వర్గాలు విడిపోయి పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్న తరుణంలో అవిశ్వాసం కోసం నోటీస్ అందజేసిన కౌన్సిలర్‌లు బీఆర్‌ఎస్ అధిష్టానంతో చర్చించి ఎమ్మెల్యే హరిప్రియ సూచనతో ఇల్లెందు చేరుకున్నారు. అయితే రెండు రోజుల తర్వాత ఇరు వర్గాలతో స్వయంగా ఎమ్మెల్యే చర్చించినా.. పరస్పరం ఆరోపణలు, ప్రత్యారోపణలతో అర్ధంతరంగా సమావేశం ముగిసింది. ఇక మీదట తమ వార్డులకు సమాచారం లేకుండా మున్సిపల్ అధికారులు వస్తే అడ్డుకోవాలని, 'మా వార్డులో – మా పాలన' కొనసాగించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది.

ఆగమ్య గోచరంగా పాలన..

మున్సిపల్ పాలక వర్గం రెండు వర్గాలుగా విడిపోయి ఎవరికి వారే అన్నట్టుగా మారిన తరుణంలో ఇరువర్గాల మధ్య అధికారుల తీరు అడ కత్తెరలో పోక చెక్కలా మారింది. ఇదిలా ఉండగా మున్సిపల్ చైర్మన్ డీవీకి వత్తాసు పలికిన కమిషనర్, డీఈ, ఏఈలను సాగనంపాలని అసమ్మతి కౌన్సిలర్లు యోచిస్తున్నట్లు తెలిసింది. ఏదేమైనా మున్సిపల్ బడ్జెట్ సమావేశం కత్తిమీద సామేనని పలువురు అంటున్నారు.

'దూర దృష్టి'తో ముందుకు..

- అద్దాల పంపిణీపై అధికారుల నజర్
- దీర్ఘదృష్టి లోపం ఉన్న వారికి ప్రత్యేక అద్దాలు
- ప్రత్యేక వెబ్‌పోర్టల్ ద్వారా కళ్లజోళ్ల ఆర్డర్
- మొదలైన తొలి విడత అద్దాల పంపిణీ



తిలక్‌నగర్‌లో ఇంటివద్దే మహిళకు కళ్లద్దాలను అందజేస్తున్న వైద్య సిబ్బంది

చుంచుపల్లి: దృష్టిలోపం సమస్యల పరిష్కారానికి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం దిగ్విజయంగా ముందుకు సాగుతోంది. కంటి వెలుగు కేంద్రాల్లో దృష్టి లోపాలను గుర్తించిన వైద్య సిబ్బంది సమస్యకు తుది పరిష్కారం అందించే వరకు శ్రమిస్తున్నారు.

ప్రత్యేక అద్దాలు..

కంటి వెలుగు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించిన తర్వాత దగ్గరి వస్తువులు కనిపించని లోపం (హ్రస్వదృష్టి) ఉన్నవారికి వెను వెంటనే రీడింగ్ గ్లాసులు అందిస్తున్నారు. ఇక దూర దృష్టి లోపం ఉన్నట్టుగా గుర్తించిన వారికి కంటి వెలుగు కేంద్రాల్లో వెంటనే అద్దాలు అందివ్వడం కష్టం. ఎందుకంటే దూరదృష్టి లోపం తీవ్రతను పాయింట్లలో కొలుస్తారు. వేర్వేరు పాయింట్లకు వేర్వేరు అద్దాలను వాడాల్సి ఉంటుంది. ఆయా కంటివెలుగు కేంద్రాల వారీగా దూరదృష్టి లోపం ఉన్న వారు ఎంతమంది, వారిలో ఏయే పాయింట్ల వారీగా ఎన్ని అద్దాలు కావాలనే అంశాలను ముందుగా గుర్తిస్తారు. ఈ వివరాల ఆధారంగా ప్రత్యేక పోర్టల్‌లో కళ్లద్దాలను ఆర్డర్ చేస్తున్నారు.

ఇంటికి వచ్చి ఇస్తున్నారు..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇప్పటి వరకు నిర్వహించిన కంటి వెలుగు పరీక్షల్లో 23,493 మందికి దూరపు చూపు లోపం ఉందని గుర్తించారు. వీరి కోసం ప్రత్యేక అద్దాలకు ఆర్డర్ పెట్టగా మొదటి విడతలో జిల్లాకు 8,200 వచ్చాయి. ఇందులో గత ఇప్పటివరకు 2,233 మంది ఇళ్లకు వెళ్లి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఆధార్ కార్డు ద్వారా సేకరించిన వివరాల ప్రకారం అందుబాటులో ఉన్నవారికి సబ్ సెంటర్లు ద్వారా అందిస్తుండగా, మరికొందరికి ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు నేరుగా ఇంటికే వెళ్లి పంపిణీ చేస్తున్నారు. దూరదృష్టి కళ్లద్దాలను ఇంటింటికీ వెళ్లి అందజేసిన లబ్ధిదారుడి ఫొటో, వివరాలను వెంటనే కంటివెలుగు ట్యాబ్‌లో నమోదు చేస్తున్నారు.

ఇంటింటికీ వెళ్లి అందిస్తున్నాం



కంటి వెలుగు శిబిరాలకు ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి పరీక్షలు చేయించుకుంటున్నారు. క్యాంపులో పరీక్షించి దృష్టి లోపాన్ని గుర్తిస్తున్నాం. అవసరమైన వారికి రీడింగ్ గ్లాసులు ఇస్తున్నాం. ఎక్కువ దృష్టి లోపం ఉంటే కళ్లద్దాలు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తున్నాం. ఇటీవలే ప్రిస్క్రిప్షన్ కళ్లద్దాలు వచ్చాయి. వాటిని సిబ్బంది ద్వారా ఇంటింటికీ వెళ్లి అందజేస్తున్నాం. ఇప్పటివరకు 2, 233 మందికి పంపిణీ చేశాం.

– జేవీఎల్ శిరీష, డీఎంహెచ్ఓ

'బండ' మరింత భారం

సబ్సిడీ గ్యాస్ సిలిండర్‌పై రూ.50 వడ్డన

- ఖమ్మం జిల్లాలో రూ.1,134, భద్రాద్రి జిల్లాలో 1,142కు చేరిన ధర
- నాన్ డొమెస్టిక్ సిలిండర్ల ధర కూడా పెంపు
- ఉమ్మడి జిల్లాలో వినియోగదారులు 6.90లక్షల మందికి పైగానే..



పాల్వంచ రూరల్/ఖమ్మం సహకారనగర్: ఉన్నట్టుండి గృహావసరాల వంట గ్యాస్ సిలిండర్ ధరను ఒక్కసారిగా రూ.50 పెంచారు. కొన్నాళ్లుగా సిలిండర్ ధరలు పెంచకపోవడంతో ఊపిరి పీల్చుకుంటుండగా బుధవారం పెంపు ప్రకటన వెలువడింది. దీనికి తోడు వాణిజ్య అవసరాల సిలిండర్‌ను కూడా రూ.350 మేర పెంచడం గమనార్హం. దీంతో వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, పెరిగిన ధర సబ్సిడీ రూపంలో వినియోగదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని అటు అధికారులు, ఇటు ఏజెన్సీల నిర్వాహకులు చెబుతున్నా చాలా మంది ఖాతాల్లో జమ కావడం లేదు. ఈ విషయంలో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

అక్టోబర్ తర్వాత ఇప్పుడే..

గృహ అవసరాలకు వినియోగించే 14 కేజీల సబ్సిడీ గ్యాస్ సిలిండర్ ధరను గత ఏడాది మార్చిలో రూ.50 పెంచారు. ఆ తర్వాత అక్టోబర్‌లో కొద్దిమేర పెంచగా.. అప్పటి నుంచి పెరగలేదు. మళ్లీ ఏడు నెలల తర్వాత బుధవారం ఒక్కసారిగా రూ.50 చొప్పున పెంచడంతో 14కేజీల గ్యాస్ సిలిండర్ ధర ఖమ్మం జిల్లాలో రూ.1,804నుంచి రూ.1,134కు, భద్రాద్రి జిల్లాలో రూ.1,042 నుంచి రూ.1,142కు చేరింది. ఉమ్మడి జిల్లాలో గృహావసరాల కనెక్షన్లు 6,92,315 వరకు ఉంటాయని అధికారిక అంచనా. ఇందులో 3లక్షల మంది నెలకోసారి సిలిండర్ తీసుకున్నా పెరిగిన ధర ప్రకారం సిలిండర్‌కు రూ.50చొప్పున రూ.1.50 కోట్ల భారం అదనంగా పడినట్లేనని చెప్పాలి. గతేడాది వరకు కరోనా దెబ్బకు ఆర్థికంగా చితికిపోయిన సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. ఓ పక్క పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో ఇబ్బంది పడుతుంటే గ్యాస్ ధర కూడా పెంచడం వారిపై పెనుభారంగా మారనుంది. కాగా, వాణిజ్య అవసరాలకు వినియోగించే నాన్ డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధర కూడా భద్రాద్రి జిలో రూ.350.50, ఖమ్మం జిల్లాలో రూ.352 పెంచడం గమనార్హం. అయితే, రవాణా ఖర్చుల దృష్ట్యా జిల్లాజిల్లాకు ధరల్లో కొంత తేడా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

జిల్లాల వారీగా గ్యాస్ వినియోగదారులు

	ఖమ్మం	భద్రాద్రి
సింగిల్ సిలిండర్లు	2,01,640	1,15,976
డబుల్ సిలిండర్లు	78,023	57,870
దీపం కనెక్షన్లు	59,742	50,771
సీఎస్ఆర్ కనెక్షన్లు	23,688	12,321
ఉజ్వల కనెక్షన్లు	47,311	44,973

ఖమ్మం జిల్లా

	ప్రస్తుత ధర	పెరిగిన ధర
డొమెస్టిక్ సిలిండర్	రూ.1,084	రూ.1,134
కమర్షియల్ సిలిండర్	రూ.1,925	రూ.2,277

భద్రాద్రి జిల్లా

	ప్రస్తుత ధర	పెరిగిన ధర
డొమెస్టిక్ సిలిండర్	రూ.1,042	రూ.1,142
కమర్షియల్ సిలిండర్	రూ.1,945	రూ.2,296.50

ఈ భారం ఎలా భరించాలి?



వంట గ్యాస్ ధరలను ఏడు నెలల క్రితం పెంచారు. మళ్లీ ఇప్పుడు ఒకేసారి రూ.50 పెంచారు. ఇలా ధర పెంచుతూ వెళ్తే భారం భరించడం ఎలాగో అర్థం కావడం లేదు. గ్యాస్ ధరలు పెంచడంతో భారం నేరుగా సామాన్య, మధ్యతరగతి ప్రజలపై పడుతోంది. ప్రభుత్వం పునరాలోచించి పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి.

– బి.మమత, పాల్వంచ

సబ్సిడీ కూడా రావడం లేదు



వంట గ్యాస్ ధర పెంచడం వల్ల సామాన్య, మధ్యతరగతి ప్రజలపై అదనపు భారం పడుతోంది. గతంలో సిలిండర్‌పై ఇచ్చే సబ్సిడీ కూడా రావడం లేదు. ఇలాగే పెంచితే గ్యాస్ సిలిండర్ మూలకు వేసి మళ్లీ కట్టెల పొయ్యిపై వంట చేసుకోవాల్సిందే. ప్రభుత్వం గ్యాస్ ధర తగ్గించి మాలాంటి ప్రజలను ఆదుకోవాలి.

– భద్రు, పాండురంగాపురం

బొలెరో వాహనాన్ని దగ్ధం చేసిన మావోయిస్టులు

ముగ్గురు వ్యక్తులపై దాడి

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా కుంట అటవీప్రాంతంలో మావోయిస్టులు బీఎస్ఎన్ఎల్ సిబ్బందిపై దాడి చేసి తీవ్రంగా కొట్టి బొలెరో వాహనాన్ని దగ్ధం చేశారు. ఈ ఘటన బుధవారం మధ్యాహ్నం జరిగింది. సుక్మా జిల్లాలోని కుంట నుంచి గొలపల్లి వరకు టెలికమ్యూనికేషన్ కేబుల్ ఏర్పాటు చేసే పనిలో ఉన్న సిబ్బందిపై మావోయిస్టు యాక్షన్ టీమ్ సభ్యులు ఈ దాడికి పాల్పడినట్టు సమాచారం. దాడికి గురైనవారిలో బీఎస్ఎన్ఎల్ జేటీఓ దన్వీర్ దేవాంగన్, కాంట్రాక్టర్ బక్షి పటేల్, సహాయకుడు సంజయ్ కుమార్ సింగ్ ఉన్నట్లు తెలిసింది. ఘటన స్థలంలో ఉన్న బొలెరో వాహనానికి నిప్పంటించడంతో పూర్తిగా దగ్ధమైంది. క్షతగాత్రులను కుంట ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కుంట పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వగా, భద్రతా బలగాలు సంఘటనా స్థలానికి చేరకుని గాలింపు చర్యలు చేపట్టాయి.



మావోయిస్టులు దగ్ధం చేసిన బొలెరో వాహనం

బోపాలపట్నంలో జేసీబీ..

చర్ల: రోడ్డు పనులకు వినియోగిస్తున్న జేసీబీని మావోయిస్టులు దగ్ధం చేశారు. ఈ ఘటన సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో బుధవారం మధ్యాహ్నం జరిగింది. బీజాపూర్ జిల్లా బోపాలపట్నం బ్లాక్ పోచనపల్లి సమీపంలో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకంలో మంజూరైన రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. రోడ్డు నిర్మాణ పనులను వ్యతిరేకిస్తున్న మావోయిస్టులు గతంలో పనులు నిలిపివేయాలంటూ హెచ్చరికలు జారీ చేసినట్లు తెలుస్తోంది. బుధవారం మధ్యాహ్నం పనులు చేస్తున్న జేసీబీ వద్దకు వచ్చి ట్యాంకర్‌లో ఉన్న డీజిల్ తీసి, వాహనంపై చల్లి నిప్పంటించారు. దీంతో జేసీబీ పూర్తిగా దగ్ధమైంది. అప్రమత్తమైన పోలీసులు పెద్ద సంఖ్యలో ఆ ప్రాంతానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు.



మావోయిస్టులు దగ్ధం చేసిన జేసీబీ

రిజర్వాయర్‌లో పడి మత్స్యకారుడు మృతి

కొణిజర్ల: ప్రమాదవశాత్తు రిజర్వాయర్‌లో పడిన మత్స్యకారుడు మృతి చెందాడు. ఎస్సై జె.శంకర్‌రావు కథనం ప్రకారం.. మండలంలోని సిద్దిక్‌నగర్‌కు చెందిన సురభి సాయిలు(46) వైరా రిజర్వాయర్‌పై కాపలాదారుడిగా ఉంటూనే చేపల వేటతో జీవనంసాగిస్తున్నాడు. ఈక్రమంలో బుధవారం తెల్లవారుజామున కాపలాకు వెళ్లిన ఆయన ప్రమాదవశాత్తు రిజర్వాయర్‌లో పడి మృతి చెందాడు. మృతదేహాన్ని గుర్తించిన మత్స్యకారులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు బయటకు తీసి ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్రమాదవశాత్తు సుబాబుల్ దగ్ధం

మధిర: మండలంలోని కంభంపాడులో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో సుబాబుల్ దగ్ధమైంది. గ్రామానికి చెందిన సామినేని వెంకటకృష్ణారావు మూడెకరాల పొలంలో సుబాబుల్ సాగు చేశాడు. గుర్తుతెలియని వ్యక్తి సిగరెట్ తాగి పడేయడంతో గడ్డికి నిప్పంటుకొని సుబాబుల్ పంటకు తాకడంతో చేతికొచ్చే పంట దగ్ధమైంది. స్థానిక రైతులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు చేరుకుని మంటలు మరింత ఎగిసిపడకుండా అదుపు చేశారు. అప్పటికే రూ.లక్ష మేర నష్టం జరిగిందని రైతు వాపోయాడు.

కూచిపూడి నృత్యకారిణికి అభినందన

కొత్తగూడెంరూరల్: వివేకవర్ధిని కళాశాల విద్యార్థిని యనమల నిహారికను బుధవారం ఎస్పీ డాక్టర్ వినీత్ అభినందించారు. బీకాం చదువుతున్న నిహారిక కూచిపూడి జాతీయ స్థాయి పోటీల్లో బహుమతి సాధించింది. బుధవారం ఎస్పీని ఆయన కార్యాలయంలో కళాశాల అధ్యాపకులతో వెళ్లి కలువగా అభినందించారు. అనంతరం ఎస్పీని సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివేకవర్ధిని కళాశాల చైర్మన్ ఎంవీ చౌదరి, సీఈఓ చైతన్యకృష్ణ, ప్రిన్సిపాల్ సతీష్, వి.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో ఇరవెండి యువకుడి మృతి

బూర్గంపాడు: మండల పరిధిలోని ఇరవెండి గ్రామానికి చెందిన ఓ యువకుడు హైదరాబాద్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడి బంధువుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన నుసుం శ్రీకాంత్‌రెడ్డి(26) కొన్నేళ్లుగా హైదరాబాద్‌లోనే ఉంటూ ఉద్యోగం చేస్తున్నాడు. మరో ఇద్దరు మిత్రులతో కలసి అతను ఓ చిన్న పరిశ్రమ కూడా నిర్వహిస్తున్నట్లు సమాచారం. సోమవారం సాయంత్రం గచ్చిబౌలి సమీపంలోని ఓ చెరువులో శ్రీకాంత్‌రెడ్డి పడిపోయినట్లు ఇరవెండిలోని కుటుంబసభ్యులకు సమాచారం అందింది. మంగళవారం కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం ఉదయం అతని మృతదేహం లభ్యమైంది. మృతదేహం చేతిలో సెల్‌ఫోన్ ఉంది. సోమవారం చెరువులో గల్లంతైతే బుధవారం మృతదేహం లభ్యంకాగా, అప్పటివరకు సెల్‌ఫోన్ చేతిలోనే ఉండటం పలు అనుమానాలకు తావిస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కాగా శ్రీకాంత్‌రెడ్డికి రెండేళ్ల క్రితం వివాహమైంది. శ్రీకాంత్‌రెడ్డి మృతితో ఇరవెండిలో విషాదం అలుముకుంది. మృతుని కుటుంబసభ్యులను ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి తదితరులు పరామర్శించారు.



శ్రీకాంత్‌రెడ్డి (ఫైల్)

రూ.10లక్షల విలువైన గంజాయి స్వాధీనం

ఇల్లెందురూరల్: ఎక్సైజ్ అధికారులు బుధవారం చేపట్టిన తనిఖీల్లో రూ.10లక్షల విలువైన గంజాయి పట్టుబడింది. ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ వెల్ల డించిన వివరాలు.. ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెంలో అధికారులు బుధవారం ఉదయం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా హర్యానా రాష్ట్రం నంబర్ ప్లేట్‌తో వెళ్తున్న కారు తనిఖీ చేయగా డిక్కీలో, సీట్ల కింద దాచిన రూ.21.60 లక్షలు విలువైన 108.550 కిలోల గంజాయి లభించింది. దీంతో డ్రైవర్, హర్యానా రాష్ట్రం లక్కర్‌పూర్‌కు చెందిన బబ్లూకుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా ఒడిశా నుంచి గంజాయి తరలిస్తున్నట్లుగా అంగీకరించాడని సీఐ తెలిపారు. కాగా, ఒడిశాలో సాగు చేస్తున్న గంజాయి కోతకు రావడంతో రవాణా జరుగుతుందనే సమాచారంతో తనిఖీలు ముమ్మరం చేశామని చెప్పారు. వాహన తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సై సమీఉల్లాఖాన్, సిబ్బంది రవిబాబు, బాబా, బాషా, చారి, మల్లికార్జున్, తులస్యా పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితుడితో ఎక్సైజ్ అధికారులు

బీటీపీఎస్ ఫైర్ సిబ్బంది సస్పెన్షన్

మణుగూరుటౌన్: మణుగూరు భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో మంగళవారం రాత్రి అగ్నిమాపక సిబ్బంది ముగ్గురు విధుల్లో మద్యం తాగారు. దీంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో జెన్‌కో ఎస్పీ ముత్యం రెడ్డి ముగ్గురిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కొత్తగూడెం పోలీసుల అదుపులో విద్యార్థులు

కారేపల్లి: సెల్‌ఫోన్ల చోరీ కేసులో కారేపల్లి మండలం గాంధీనగర్ గిరిజన గురుకులంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ముగ్గురు విద్యార్థులను కొత్తగూడెం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. గాంధీనగర్ గిరిజన గురుకులంలో ఇంటర్ చదువుతున్న ముగ్గురు విద్యార్థులు గత నెల 25న రాత్రి ఎవరికీ చెప్పకుండా కొత్తగూడెం వెళ్లారు. ఇందులోని ఓ విద్యార్థి సోదరుడు కొత్తగూడెంలోని పోస్టుమెట్రిక్ హాస్టల్‌లో ఉండగా, ఆయన వద్దకు వెళ్లి 26న రాత్రి అక్కడే నిద్రించారు. ఇక 27వ తేదీన ఉదయం గాంధీనగర్ గురుకులానికి వచ్చారు. అయితే, కొత్తగూడెం పోస్టుమెట్రిక్ హాస్టల్‌లో ఎనిమిది మంది విద్యార్థుల సెల్‌ఫోన్లు పోవడంతో అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ సందర్భంగా గాంధీనగర్ గురుకుల విద్యార్థులు వచ్చివెళ్లారని తెలియడంతో బుధవారం ఇక్కడకు చేరుఉన్న కొత్తగూడెం పోలీసులు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, ముగ్గురిని విచారణ నిమిత్తం తీసుకెళ్లినట్లు తెలిసింది.

క్లుప్తంగా

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న పాల్వంచ డీఎస్పీ వెంకటేష్

చుంచుపల్లి: ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పాల్వంచ డీఎస్పీ వెంకటేష్ సూచించారు. గురువారం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు సోదర భావంతో మెలుగుతూ ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని చెప్పారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని ఉద్బోధించారు. మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్, హెచ్ఓడీ ఎం.వెంకటేశ్వరరావు, ఎస్ఐ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదైతే ఉద్యోగం కూడా రాదు



మాట్లాడుతున్న కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్

సుజాతనగర్: విద్యాసంస్థల్లో ర్యాగింగ్ నిషేధమని, ర్యాగింగ్‌కు పాల్పడినవారిపై కేసు నమోదైతే ప్రభుత్వ ఉద్యోగాలు కూడా రావని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ పేర్కొన్నారు. అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో ర్యాగింగ్ నిరోధంపై బుధవారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ర్యాగింగ్ చేయడమంటే ఎదుటి వారిని హింసించి రాక్షస ఆనందం పొందటమేనని పేర్కొన్నారు. కేసులు నమోదైతే ఇతర దేశాలకు వెళ్లేందుకు పాస్‌పోర్టు కూడా రాదని, నేరం చేసిన వారితోపాటు కుటుంబ సభ్యులు సైతం శిక్షను అనుభవించాల్సి వస్తుందని చెప్పారు. విద్యార్థులు కళాశాలలో చేరే సమయంలోనే వారి నుంచి ర్యాగింగ్‌కు పాల్పడనని లిఖిత పూర్వక హామీ తీసుకోవాలని అన్నారు. కళాశాలలో ర్యాగింగ్ కమిటీలు వేసి ఆ కమిటీలో పోలీసులు, పాత్రికేయులను సభ్యులుగా చేర్చాలని తెలిపారు. సీఐ రమాకాంత్, డైరెక్టర్ జి.నరసింహరావు, ప్రిన్సిపాల్ వి.సీతారాం ప్రసాద్, ఎస్ఐ పి.తిరుపతిరావు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆంటోని

భద్రాచలం: విద్యార్థులు ఉన్నత స్థానంలో నిలవాలంటే కమ్యూనికేషన్ స్కిల్స్ తప్పనిసరిగా ఉండాలని రిసోర్స్‌పర్సన్ ఆంటోని సూచించారు. బుధవారం భద్రాచలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. కళాశాల ప్రధానాచార్యులు డి.భద్రయ్య, టీఎస్‌కేసీ ఇన్‌చార్జ్ ఎస్ శ్యామ్‌ప్రసాద్, పూర్ణిమ, నరేందర్ రెడ్డి, కామేశ్వరరావు, వీరన్న, భవాని, కల్పన, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

వ్యక్తి ఆత్మహత్య

భద్రాచలంటౌన్: మనోవేదనతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పట్టణ పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని ఇందిరా కాలనీకి చెందిన సత్యనారాయణ(32) భార్య కొద్ది నెలలుగా కాపురానికి రావడం లేదు. దీంతో మనోవేదన చెందుతున్న సత్యనారాయణ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బాలికపై అత్యాచారయత్నం

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో ఓ బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం జరిగింది. ఓ మైనర్ బాలుడు బాలికను చాక్‌లెట్ కొనిస్తామని చెప్పి తీసువెళ్లి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు ఆ బాలుడికి దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించినట్లు తెలిసింది.

చెట్టును ఢీకొట్టిన ట్రాక్టర్



నుజ్జునుజ్జయిన ట్రాక్టర్ ఇంజన్

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల సమీపంలో బుధవారం ప్రధాన రహదారిపై ఎదురుగా వస్తున్న గేదెను తప్పించబోయిన ట్రాక్టర్ డ్రైవర్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టాడు. ఈ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ షేక్ నాగుల్‌మీరాకు తీవ్ర గాయాలయ్యాయి. చెట్టు, ట్రాక్టర్‌కు మధ్య డ్రైవర్ కాలు ఇరుక్కుని విరిగిపోగా, బయటకు తీసిన స్థానికులు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,781

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్ తదితరులు

జూలూరుపాడు: బంజారాల సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ అన్నారు. భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఆధ్వర్యాన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను బుధవారం జూలూరుపాడులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాములునాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొనగా, సాధువులు, పూజారులు భోగ్ బండారో(నైవేద్యం) సమర్పించి పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలకు హాజరు కావడం ఆనందంగా ఉందని, ఇదే తరహాలో ఏటా ఉత్సవాలు నిర్వహించాలని సూచించారు. భారతీయ గోర్ బంజారా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవిచందర్ చౌహాన్, ఉపాధ్యక్షుడు మాలోత్ రాందాస్ నాయక్, జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, జూలూరుపాడు ఎంపీపీ లావుడ్యా సోనీతో పాటు బానోత్ రాంబాబు, భోజ్యానాయక్, ప్రేమ్‌చంద్ నాయక్, కొదుమూరి కోటేశ్వరరావు, గలిగె సావిత్రి, బోడా శాంతిరాం, భూక్యా రాములు, నున్నా రంగారావు, ఎస్.కే.మైబు తదితరులు పాల్గొన్నారు.

పగిడిద్దరాజు జాతర షురూ..



పగిడిద్దరాజును తీసుకొస్తున్న ఆదివాసీలు

గుండాల: మేడారం సమ్మక్క భర్త, యాపలగడ్డ గ్రామానికి చెందిన అరెం వంశీయుడు పగిడిద్దరాజు జాతర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. గురువారం వనం(సమ్మక్క దేవత) రాకతో నిండు జాతర జరగనుంది. యాపలగడ్డ గ్రామానికి చెందిన పూజా రులు, వడ్డెల ఆధ్వర్యంలో గర్భగుడి వద్ద ఆభరణా లకు, శివ సత్తులకు పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గుట్ట నుంచి పగిడిద్దరాజును డప్పువాయిద్యాలతో, గిరిజన నృత్యాలతో ఊరేగింపు ద్వారా గద్దెల వద్దకు చేర్చి పూజలు చేశారు. గురువారం వనంను తీసుకొస్తారు. మార్గంమధ్యలో ఎదురిల్లుట కార్యక్రమం నిర్వహిస్తా రు. రాత్రి జోగు, గంగాస్నానం కార్యక్రమాలు నిర్వహిస్తారు. శుక్రవారం తెల్లవారుజామున గుడిమెలిగి, దేవతలకు హారం ఇస్తారు. ఉదయం నుంచి భక్తులు భారీ సంఖ్యలో మొక్కులు చెల్లించుకుంటారు. చుట్టుపక్కల మండలాల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. ఈ కార్యక్రమంలో పూజారులు అప్పయ్య, బుచ్చ య్య, లక్ష్మీనర్సు, కాంతారావు, చిన్న కాంతారావు, లచ్చు పటేల్, భిక్షం, రామారావు, లక్ష్మయ్య, సమ్మయ్య, సత్యం తదితరులు పాల్గొన్నారు.

రెక్కల రామక్క జాతర..



విద్యుత్ దీపాలతో అలంకరించిన ఆలయ ప్రాంగణం

గుండాల: ఆళ్లపల్లి మండలం మర్కోడు పంచాయతీ పెద్దూరు గ్రామంలో కొమరం వంశీయుల ఇలవేల్పు, ఆదిశక్తి రెక్కల రామక్క దేవత జాతర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. మంగళవారం మండ మెలుగుట నిర్వహించారు. బుధవారం సాయంత్రం దేవుడిని ప్రత్యేక పూజల నడుమ, డప్పు వాయిద్యాల నడుమ గుట్ట నుంచి గర్భగుడికి తీసుకొచ్చారు. తలపతులు, వడ్డెలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం వన దేవత గుడికి చేర్చడంతో నిండు జాతర మొదలవుతుంది. రాత్రి గంగా స్నానం, శుక్రవారం నాడు భక్తులు దేవుడికి మొక్కులు అప్పగిస్తారు. జాతర నాలుగు రోజులపాటు ఘనంగా జరుగుతుందని స్థానికులు తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

సుజాతనగర్: అదనపు కట్నం కోసం వేధిస్తున్న వారిపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ పి.తిరుపతిరావు కథనం ప్రకారం.. మండలంలోని సర్వారం గ్రామ పంచాయతీ గోపాతండాకు చెందిన మూడ్ అరుణకు తల్లాడ మండలం గాంధీనగర్‌కు చెందిన హరిప్రసాద్‌తో గతేడాది వివాహం జరిగింది. పెళ్లి సమయంలో రూ.27 లక్షల నగదు, 30 తులాల బంగారం, రూ.10 లక్షల విలువైన గృహోపకరణాలు ఇచ్చారు. బ్యాంకు ఉద్యోగిగా పనిచేస్తున్న హరిప్రసాద్ భార్యను కొన్ని రోజులు బాగానే చూసుకున్నాడు. ఆ తర్వాత అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడు. గర్భవతి అయినప్పటికీ వేధింపులు ఆపలేదు. రోజూ తాగి వస్తూ అదనంగా మరో రూ.20 లక్షలు కట్నం కావాలని వేధిస్తున్నాడు. భర్త హరిప్రసాద్‌తో పాటు, అత్తామామలు తావుర్యా, లక్ష్మి, ఆడపడుచు విజయ, మరో ఆడపడుచు భర్త వాంకుడోత్ గిరి ఇబ్బందులు పెడుతున్నారని బాధితురాలు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థుల ఆత్మబలిదానాలతోనే తెలంగాణ

బీజేపీ రాష్ట్ర నాయకురాలు, సినీనటి కవిత



మాట్లాడుతున్న బీజేపీ నాయకురాలు కవిత

ఖమ్మం మామిళ్లగూడెం: విద్యార్థుల ఆత్మబలిదానాలతోనే తెలంగాణ ఏర్పడిందని బీజేపీ రాష్ట్ర నాయకురాలు, సినీ నటి కవిత అన్నారు. కానీ తన వల్లే రాష్ట్రం ఏర్పడిందని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పుకుంటున్నారని విమర్శించారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేసీఆర్‌ను ఇంటికి పంపటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సంక్షేమ పథకాలు, తెలంగాణ సెంటిమెంట్‌తో మరోమారు ప్రజలు మోసపోయే పరిస్థితి లేదని చెప్పారు. పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి, దళితందరికీ దళితబంధు ఇలా ఏ హామీ కూడా నెరవేరలేదని ఆరోపించారు. కాగా, రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను వెంటనే అర్హులకు కేటాయించకపోతే 15వ తేదీ తర్వాత తామే ఆ పనిచేస్తామని చెప్పారు. జిల్లాలో 360చోట్ల కార్నర్ మీటింగ్‌లు నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకున్నామని వివరించారు. ఈ సమావేశంలో నాయకులు గెంటెల విద్యాసాగర్, శ్యాంరాథోడ్, రుద్ర ప్రదీప్, నున్నా రవికుమార్, మంద సరస్వతి, విజయరెడ్డి, దీకొండ శ్యాం, సుధాకర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...



చీపురు పట్టి.. బాత్‌రూమ్‌లు శుభ్రపరచి..

- లింగంపల్లి బడిలో అపారిశుధ్యం
- స్వయంగా శుభ్రం చేసిన ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి

బచ్చన్నపేట: ఆయనొక ప్రజాప్రతినిధి. ఒక ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. అక్కడి అపరిశుభ్రత వాతావరణం చూసి హెచ్‌ఎంపై మండిపడ్డారు. అంతే.. స్వయంగా చీపురు పట్టి బాత్రూంలు, మరుగుదొడ్లు శుభ్రపరిచారు. దీనికి వేదికైంది జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం లింగంపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల. 'మనఊరు–మనబడి' కార్యక్రమం కింద ఎంపికైన ఈ పాఠశాలను రూ.29 లక్షలు వెచ్చించి అన్ని హంగులతో తీర్చిదిద్దారు. బుధవారం పాఠశాలను పునః ప్రారంభించేందుకు వచ్చిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి.. చెత్తతో నిండిన మరుగుదొడ్లు, బాత్రూంలను గమనించారు. వెంటనే చీపురు పట్టుకొని చెత్తా చెదారాన్ని బయటకు ఊడ్చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు, వసతులు కల్పించడానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తుంటే.. ఈ పాఠశాలలో హెచ్‌ఎం నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ మండిపడ్డారు.

పసుపు క్వింటా రూ.7,648

నిజామాబాద్ మార్కెట్ మార్డులో పలికిన ధర

ఇందూరు (నిజామాబాద్ అర్బన్): నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం పసుపు కొమ్ములకు గరిష్ట ధర క్వింటా రూ.7,648 పలికింది. ఈ ఏడాది సీజన్‌లో ఇప్పటి వరకు ఇదే అధిక ధర. వేల్పూర్ మండలం పడగల్‌కు చెందిన రైతు సామ శ్రీనివాస్ 20 బస్తాల పసుపును మార్కెట్‌కు తీసుకురాగా ఈ ధర పలికింది. మార్కెట్‌లో కొమ్ము పసుపు 5,695 క్వింటాళ్లు, మండ పసుపు 2,498 క్వింటాళ్లు, చూర పసుపు 825 క్వింటాళ్లు అమ్ముడయ్యాయి.

వనరులు పుష్కలం.. అవకాశాలు అపారం

▶ మొదటి పేజీ తరువాయి


శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు జరిగే 'గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్'నేపథ్యంలో బుధవారం ఆయన కొందరు జాతీయ మీడియా ప్రతినిధులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఇంటర్వ్యూ ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే...

- పెట్టుబడికి ఉన్న అవకాశాలను, పరిశ్రమల ఏర్పాటుకున్న అనుకూలతలను పారిశ్రామిక వేత్తలకు వివరించడం ద్వారా ఈ రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకురావడం సదస్సు లక్ష్యం. పరిశ్రమల ఏర్పాటుకు అత్యంత సానుకూల వాతావరణం రాష్ట్రంలో ఉంది.
- ప్రభుత్వం తొలి నుంచీ స్నేహపూర్వక పారిశ్రామిక విధానంతో ముందుకు వెళుతోంది. ఏ రాష్ట్రంలోనైనా పరిశ్రమలు నెలకొల్పాలంటే ఆ రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వటం సహజం. ప్రభుత్వం నుంచి అందే సహకారం, రాయితీలు, ప్రోత్సాహకాలు, రాష్ట్రంలో ఉన్న అనువైన వాతావరణం, వనరులను పారిశ్రామివేత్తలు చూస్తారు. రాష్ట్రంలో ఇవన్నీ ఉన్నాయి. 974 కిలోమీటర్ల సుదీర్ఘ తీరం పరిశ్రమలకు అనుకూలం.
- రాష్ట్రంలో 48 రకాల ఖనిజాలు లభ్యమవుతాయి. ఇది ఖనిజాధారిత పరిశ్రమలకు ఎంతో అనుకూలం. సిమెంట్, లైమ్‌స్టోన్ పరిశ్రమలు నెలకొల్పడానికి మన వద్ద ఎంతో అనుకూల పరిస్థితులున్నాయి.
- 6 పోర్టులున్నాయి. కొత్తగా 4 పోర్టులు నిర్మిస్తున్నాం. అందులో 3 పోర్టులను ప్రభుత్వమే సొంత నిధులతో నిర్మిస్తోంది. పోర్టు ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రం అత్యంత అనుకూలం. పోర్టు ఆధారిత పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. పోర్టు రవాణా కారణంగా రాష్ట్రంలో తయారయ్యే వస్తువుల ఎగుమతికి తక్కువ ఖర్చవుతుంది.
- కర్బన ఉద్గారాలను తగ్గించి పర్యావరణ పరిరక్షణకు మేలు చేసే గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, పంప్డ్ స్టోరేజ్... గ్రీన్ ఎనర్జీదే భవిష్యత్ అంతా. ఈ రంగంలో పెట్టుబడులకు రాష్ట్రంలో మంచి అవకాశాలున్నాయి. వీటివల్ల చౌకగా విద్యుత్ అందుబాటులోకి వస్తుంది. రెన్యువబుల్, గ్రీన్ ఎనర్జీకి ఏపీలో పుష్కలమైన వనరులున్నాయి. విండ్, హైడ్రోజన్, సోలార్ విద్యుదుత్పత్తికి ఇక్కడ అపార అవకాశాలున్నాయి. 82 గిగావాట్ రెన్యూవబుల్ ఎనర్జీ కెపాసిటీ, 34 గిగావాట్ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు అవకాశం ఉంది. భవిష్యత్తులో గ్రీన్ ఎనర్జీలో ఏపీ కీలక పాత్ర పోషిస్తుంది.
- పారిశ్రామిక వేత్తల అభిప్రాయాలు తీసుకుని, వాటి ప్రకారం ప్రో యాక్టివ్‌గా వ్యవహరిస్తున్నాం. అందుకే ఈ రాష్ట్రంవైపు ఎప్పుడూ చూడని అంబానీ, బిర్లా, అదానీ, బంగూర్, బజాంకా, దాల్మియా.. వంటి వారు ఇప్పుడు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నారు. గతంలో ఇంతమంది దిగ్గజ పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చింది లేదు.
- 2021–22లో 11.43 శాతం వృద్ధిరేటుతో దేశంలోనే ఏపీ మొదటి స్థానంలో నిలిచింది. పలురంగాల్లో అగ్రగామిగా నిలుస్తూ... సులభతర వాణిజ్య విధానాల్లో (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) వరుసగా మూడేళ్లు నెంబర్ వన్‌గా నిలిచింది.

ఎస్‌డీజీ లక్ష్యాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలు

ఉచిత పథకాలు అంటూ కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అభివృద్ధి చేయకుండా కేవలం సంక్షేమ పథకాలే ఇస్తున్నామనుకుంటే దేశంలోనే అత్యధికంగా 11.43 శాతం వృద్ధిని ఎలా సాధిస్తాం? అన్ని రంగాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను చేరుకుంటూ అభివృద్ధి దిశగా అడుగులేస్తున్నాం. ప్రతి పథకాన్నీ ఎస్‌డీజీ లక్ష్యాలకు అనుగుణంగా డీబీటీ రూపంలో నేరుగా లబ్ధిదారులకే అందిస్తున్నాం. ఉదాహరణకు జీఈఆర్ గణాంకాలు చూస్తే కాలేజీల్లో చేరే వారి సంఖ్య రాష్ట్రంలో ఎక్కువ. 18 నుంచి 23 ఏళ్ల వయస్సులో ఉన్నవారు చదువు మానకుండా కాలేజీలో చేరేలా పర్యవేక్షిస్తున్నాం. విద్యార్థి డిగ్రీ పూర్తి చేస్తే అతని హోదా మారుతుంది. అందుకే తల్లిదండ్రులకు విద్య భారం కాకుండా ఉండేలా 100 శాతం ఫీజు రీఇంబర్స్‌మెంట్ ఇస్తూ విద్యాదీవెన, వసతిదీవెన, ప్రాథమిక విద్యలో అమ్మఒడి వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. ఈ మొత్తం నేరుగా కళాశాలలకు ఇవ్వకుండా తల్లుల ఖాతాల్లో వేస్తున్నాం. దీనివల్ల ఆ విద్యార్థి చదువు మధ్యలో ఆగదు. పట్టభద్రుడై ఆదాయాన్ని ఆర్జించడం ద్వారా పేదరికం నుంచి మధ్యతరగతి హోదాలోకి ఆ కుటుంబం మారుతుంది. దేశాభివృద్ధిలో ఇది ఎంతో కీలకమైన అంశం.

బడ్జెట్ పరిమితుల్లోనే... పారదర్శకంగా...



ఈ పథకాలన్నీ కూడా బడ్జెట్ పరిమితుల్లోనే అమలు చేస్తున్నాం. సాధారణంగా రాజకీయ నేతలు సామాన్యులకు అర్థం కాని రీతిలో బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. గతంలో కూడా ఇదే బడ్జెట్ ఉండేది. ఆ నిధులు ఎక్కడికి వెళ్తాయో ఎవరికీ అర్థమయ్యేది కాదు. లబ్ధిదారులెవరో ఆ దేవుడికే తెలియాలి అనే పరిస్థితి ఉండేది. కానీ రాష్ట్రంలో తొలిసారిగా మేము అందరికీ సరళంగా అర్థమయ్యేలా పారదర్శకంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టాం. ప్రతి పథకాన్నీ బడ్జెట్‌లో కచ్చితంగా నిర్దేశించాం. ప్రతి పథకాన్ని లబ్ధిదారుల ఆధార్ నంబర్, బ్యాంకు ఖాతాలతో అనుసంధానించాం. నేరుగా నగదు బదిలీ విధానంలో పథకాన్ని అమలు చేస్తున్నాం.

- ఏ రాష్ట్రానికైనా కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం. అందుకే కేంద్రంలోని బీజేపీతో మేము స్నేహపూర్వక వాతావరణమే కోరుకుంటున్నాం. మాకు రాజకీయాల కంటే మా రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం. ప్రజలకు ఏం కావాలో అది చేయాలనేది మా ప్రభుత్వ విధానం. అందుకే మా ప్రభుత్వం రియాలిటీలో పేదలకు ఏం కావాలో అదే చేస్తోంది. అందుకే సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో వేగంగా ముందుకెళ్తున్నాం.

3 రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు

ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా గత ప్రభుత్వ తప్పులను కొన్నింటిని సరిచేస్తుంది, కొన్ని కొత్త కార్యక్రమాలు ప్రారంభిస్తుంది. మేం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలలు, వ్యవసాయం.. ఈ రంగాల్లో పూర్తి స్థాయిలో విప్లవాత్మక చర్యలు చేపట్టాం. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడు లేని విధంగా 'నాడు–నేడు' పేరిట ప్రభుత్వాసుపత్రులు, ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరిస్తున్నాం. ప్రాథమిక విద్యా రంగంలో 'అమ్మ ఒడి' పథకం ఓ విప్లవం. మేము అధికారంలోకి వచ్చేనాటికి ప్రాథమిక విద్య ప్రమాణాల్లో ఆంధ్ర ప్రదేశ్ దేశంలో చివరి రెండు, మూడు స్థానాల్లో ఉండేది. ఈ పరిస్థితి మార్చాలనుకున్నాం. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు మేం అమలు చేస్తున్న పథకాలు చెబుతా. అమ్మ ఒడి పథకం కింద పిల్లల్ని బడికి పంపే తల్లుల ఖాతాలో రూ.15వేలు వేస్తున్నాం. దీనికి కనీసం 75 శాతం హాజరు ఉండాలనే నిబంధన పెట్టాం. ఇంటర్మీడియట్ వరకు అమ్మ ఒడి పథకం ఇస్తున్నాం. తరవాత జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాలు అందిస్తున్నాం. ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుండటంతో పిల్లల చదువు ఎందుకు ఆపాలని తల్లిదండ్రులు భావిస్తారు కదా?. ఇక ఏటా స్కూళ్లు తెరవటానికి ముందే జగనన్న విద్యా కానుక పేరిట సమగ్ర కిట్‌ను ఇస్తున్నాం. తెలుగు, ఇంగ్లీష్ బైలింగ్వల్ పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, స్కూల్ బ్యాగ్, షూ, సాక్సులు, యూనిఫామ్ ఇస్తూ యూనిఫామ్‌కు కుట్టేందుకు మజూరీ చార్జీలూ ఇస్తున్నాం. దీనికి ఏటా రూ.వేయి కోట్లకు పైగా నిధులు వెచ్చిస్తున్నాం. ఇక మధ్యాహ్న భోజన పథకాన్ని పూర్తిగా మార్చాం. టీడీపీ ప్రభుత్వంలో మధ్యాహ్న భోజన పథకానికి రూ.600 కోట్ల బడ్జెట్ ఉండేది. దాన్ని రూ.1,908కోట్లకు పెంచాం. జగనన్న గోరు ముద్ద పేరుతో భోజనం నాణ్యత పెంచాం. ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టాం. ఆరో తరగతి నుంచి డిజిటల్ తరగతులు ఏర్పాటు చేస్తున్నాం. నాడు–నేడు మొదటి దశ కింద 15,275 పాఠశాలలను ఎంపిక చేసి వాటి రూపు రేఖలను సమూలంగా మార్చాం. రాష్ట్రంలో 30,230 తరగతుల డిజిటలైజేషన్‌ను ఈ జూన్ నాటికి పూర్తి చేస్తున్నాం. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ఇస్తున్నాం. ఇప్పటివరకు 60వేల మంది ఉపాధ్యాయులకు, 4.70 లక్షల మంది విద్యార్థులకు మొత్తం 5.30 లక్షల ట్యాబ్‌లు పంపిణీ చేశాం.

అంతేకాదు! అంగన్‌వాడీ కేంద్రాలకు నిధులు పెంచాం. గతంలో అంగన్‌వాడీ కేంద్రాలకు ఏడాదికి రూ.800కోట్లు కేటాయించేవారు. దీన్ని రూ.1,800 కోట్లకు పెంచాం. జగనన్న సంపూర్ణ పోషణ, సంపూర్ణ పోషణ్ ప్లస్ పేరిట అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార నాణ్యతను మెరుగుపరిచాం. ఎందుకంటే ఆరేళ్ల వరకే పిల్లలు శారీరకంగా, మానసికంగా వేగంగా ఎదుగుతారు. ఆ సమయంలో వారికి సరైన పోషకాహారం అందించాలి. అదే చేస్తున్నాం. ఆడపిల్లల పెళ్లికి సహకరిస్తూ... వారు చదువు కొనసాగించేలా నిబంధనలు పెట్టాం. 10వ తరగతి పాస్ అవ్వాలని, 18 ఏళ్లు నిండాలని నిబంధన పెట్టడం వల్ల వారు పది తరవాత ఇంటర్ చదువుతారు. డిగ్రీలోనూ చేరతారు. చేరారు కనక పూర్తి చేస్తారు. ఈ ఉద్దేశంతోనే వివాహానికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం చేస్తున్నాం.

➤ చదువుల్లో రాణిస్తూ విదేశాల్లో చదువుకోవాలనుకునే వారికి 'విదేశీ దీవెన' పథకాన్ని అందిస్తున్నాం. నిర్దేశిత 21 ఫ్యాకల్టీల్లో ప్రపంచంలోని టాప్–50 యూనివర్సిటీల్లో ఉన్నత విద్యను అభ్యసించే మన విద్యార్థులకు గరిష్ఠంగా రూ.1.25 కోట్ల వరకూ ఫీజును చెల్లిస్తున్నాం. గత ఏడాది 200మందికి స్పాన్సర్‌షిప్ అందించాం. ఇలాంటి వర్సిటీల్లో చదివిన వాళ్లంతా వచ్చే పదేళ్లలో అత్యున్నత స్థాయికి చేరుకుని, మన రాష్ట్రానికి ఆస్తిగా మారతారన్న విశ్వాసం నాకుంది.

➤ ప్రభుత్వాసుపత్రులకు కాయకల్ప చికిత్స చేస్తున్నాం. ఎవ్వరూ ఊహించని విధంగా వైద్య రంగంలో ఖాళీగా ఉన్న 48,000 పోస్టులను భర్తీ చేశాం. ప్రతి హాస్పిటల్‌లో డాక్టర్, నర్సులు ఉండేలా విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చాం. జాతీయస్థాయి ప్రమాణాలు ఉండేలా హాస్పిటల్స్‌ను ఆధునీకరించాం. 17 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేస్తున్నాం. ఆరోగ్య శ్రీ పరిధిలోకి వచ్చే చికిత్సల సంఖ్యను 1,059 నుంచి ఏకంగా 3,255కు పెంచాం. ఫ్యామిలీ డాక్టర్, విలేజ్ హెల్త్ క్లినిక్, హెల్త్‌కార్డుల డిజిటలైజేషన్ ఇలా అనేక సంస్కరణలు తెచ్చాం.

➤ వ్యవసాయ రంగానికి వస్తే... రైతు భరోసా కేంద్రంపేరిట రైతులకు సంబంధించిన సేవలన్నీ ఒకేచోట అందిస్తున్నాం. ప్రతి గ్రామానికీ వ్యవసాయ శాస్త్రంలో డిగ్రీ పొందిన అధికారిని నియమించడమే కాకుండా ప్రతి రైతు తాలూకు పంట వివరాలను 'ఈ క్రాప్'లో నమోదు చేస్తున్నాం. రైతులకు విత్తనం దగ్గర నుంచి పంట అమ్ముకోవడం వరకూ ఆర్‌బీకే ద్వారా చేయూత అందిస్తున్నాం. పాలన సంస్కరణల్లో భాగంగా....

ప్రతి 2000 జనాభాకు గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేయడమే కాకుండా ప్రతి 50 మంది జనాభాకూ ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేశాం. ఎటువంటి అవినీతి లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. దేశంలో డీబీటీ ద్వారా నేరుగా నగదు అందుకుంటున్న లబ్ధిదారులు రాష్ట్రంలోనే అధికం. మాకు ఓటు వేశారా లేదా, ఏ పార్టీ అనేది చూడకుండా పథకాలు అందిస్తున్నాం.

జిల్లా వార్తలు

10వరకు దరఖాస్తు చేసుకోండి



ఖమ్మం సహకారనగర్: ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో)లో సర్టిఫికెట్, డిప్లొమా, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా, డిగ్రీ, మాస్టర్ డిగ్రీ తదితర కోర్సుల్లో చేరేందుకు ఈనెల 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఇగ్నో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బొల్లా రాజు తెలిపారు. ఖమ్మం కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలలో బుధవారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ దేవేందర్, ప్రిన్సిపాల్ రమణారావు తదితరులు పాల్గొన్నారు.

రామయ్య భక్తులకు మజ్జిగ



భక్తులకు మజ్జిగ అందచేస్తున్న ఏఈఓలు

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎండవేడి నుంచి ఉపశమనం కలిగించేలా మజ్జిగ పంపిణీ చేయనున్నారు. వేసవి తీవ్రత పెరుగుతుండడంతో దేవస్థానం ఆధ్వర్యాన ఉచిత మజ్జిగను పంపిణీని బుధవారం ప్రారంభించారు. ఏఈఓలు శ్రావణ్‌కుమార్, భవాని రామకృష్ణ, సూపరింటెండెంట్ సాయిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, వేదపండితులు లింగాల ప్రసాద్, కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

రేపు పత్తి కొనుగోళ్లు నిలిపివేత

ఖమ్మంవ్యవసాయం: చాంబర్ ఆఫ్ కామర్స్ బాధ్యుల వినతి మేరకు శుక్రవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశం తెలిపారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పత్తి కొనుగోలు చేసే వ్యాపారులు అన్ని పంటల మాదిరిగానే అమ్మకం పన్ను చెల్లించగా, కేంద్ర జీఎస్టీ అధికారులు మాత్రం కొనుగోళ్లపైనా జీఎస్టీ చెల్లించాలని నోటీసులు జారీ చేశారు. పలుమార్లు ఆందోళనలు చేసినా ఫలితం లేకపోవడంతో చాంబర్ ప్రతినిధులు, వ్యాపారులు ఉన్నతాధికారులను కలిసేందుకు శుక్రవారం హైదరాబాద్ వెళ్తున్నందున కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. అయితే, శనివారం పత్తి కొనుగోళ్లు యథావిధిగా జరుగుతాయని కార్యదర్శి తెలిపారు.

రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

- డీసీసీబీ చైర్మన్ నాగభూషణం, విప్ కాంతారావు
- పినపాక నియోజకవర్గంలో మూడు గోదాంల ప్రారంభం



బూర్గంపాడులో గోదాంను ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ కూరాకుల, ప్రభుత్వ విప్ కాంతారావు

బూర్గంపాడు: తెలంగాణలో రైతుల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ అనేక పథకాలను అమలుచేస్తున్నారని ఖమ్మం డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలతో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. బూర్గంపాడు మండలం మోరంపల్లిబంజర, ఇరవెండి, బూర్గంపాడు గ్రామాల్లో డీసీసీబీ ఆధ్వర్యంలో నిర్మించిన మూడు గోదాంలను బుధవారం ప్రారంభించారు. అలాగే, ఇరవెండిలో ఏర్పాటుచేసిన సమావేశంలో 70మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం నాగభూషణం, కాంతారావు మాట్లాడుతూ తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గమనిస్తున్న పొరుగు రాష్ట్రాల ప్రజలు తమ రాష్ట్రంలోనూ అమలుచేయాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. రైతుల సంక్షేమం కోసం రైతుబంధు, బీమా, ఉచిత విద్యుత్, సాగునీటి ప్రాజెక్టులు, మిషన్ కాకతీయ, రైతు వేదికలు, గోదాంల నిర్మాణంతో తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. రానున్న రోజులలో రైతులకు ప్రభుత్వం మరింత చేయూతగా నిలుస్తుందని తెలిపారు. డీసీసీబీ ఆధ్వర్యాన పంట రుణాలు ఇవ్వడమే కాక విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తున్నట్లు నాగభూషణం వెల్లడించారు. కాగా, ఇరవెండిలో గోదాం నిర్మాణానికి స్థలదానం చేసిన తాళ్లూరి పంచాక్షరయ్య, జిల్లాలో సేవా కార్యక్రమాలను చేపడుతున్న తానా మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బూర్గంపాడు పీఏసీఎస్ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, డీసీఓ వెంకటేశ్వర్లు, మార్కెట్ చైర్మన్ పొడియం ముత్యాలమ్మ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి సింగరేణి చేయూత

రాష్ట్ర ఇంధన శాఖ స్పెషల్ సీఎస్ సునీల్‌శర్మ



ఆఫీసర్స్ క్లబ్‌లో కుటుంబ సభ్యులు, అధికారులతో సునీల్‌శర్మ

ఇల్లెందు: సింగరేణి సంస్థ అంచెలంచెలుగా ఎదిగి ప్రత్యేక గుర్తింపు సాధించడమే కాక దేశాభివృద్ధిలో కీలకంగా నిలుస్తోందని రాష్ట్ర ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సునీల్‌శర్మ తెలిపారు. ఇల్లెందు ఏరియాలోని పలు గనులను బుధవారం పరిశీలించిన ఆయన రోజువారీ బొగ్గు ఉత్పత్తి, సోలార్ విద్యుత్‌ప్లాంట్‌లో ఉత్పత్తి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో సమావేశమై మాట్లాడుతూ గతంతో పోలిస్తే సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తిలో లక్ష్యాలను అధిగమిస్తూ అగ్రస్థానంలో నిలుస్తోందన్నారు. తద్వారా దేశం, రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తోందని తెలిపారు. ఏరియా జీఎం షాలేమురాజు, అధికారులు మల్లారపు మల్లయ్య, పి.శ్రీనివాస్, మహేశ్వర్, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మా నాన్న ఇక్కడే పనిచేశారు..

'మా నాన్న రామ్‌దూత్ శర్మ ఇల్లెందు ఏరియాలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(మైనింగ్)గా పనిచేశారు' అని స్పెషల్ సీఎస్ సునీల్‌శర్మ గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో తాను ఇల్లెందులో గడిపిన రోజులను గుర్తు చేసుకున్న ఆయన జీఎం బంగ్లా, ఓల్డ్ కాలనీలోని రస్స్ అండ్ గోల్ఫ్ స్టేడియం, ఆఫీసర్స్ క్లబ్, ఇల్లెందు చెరువును పరిశీలించారు. ఆనాటి జ్ఞాపకాలను సింగరేణి అధికారులు, కుటుంబ సభ్యులతో పంచుకున్నారు.

ఐఆర్‌పీఎం జీఎంగా కుమార్‌రెడ్డి



కొత్తగూడెంటౌన్: సింగరేణి సంస్థ కార్పొరేట్ జీఎం పర్సనల్ ఈఈ అండ్ సీఎస్‌ఆర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఏ.కుమార్‌రెడ్డికి ఐఆర్‌పీఎం జీఎంగా అదనపు బాధ్యతలు కేటాయించారు. ఈ మేరకు బుధవారం యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.



ఆ'వల' నుంచి రక్ష!

చేపలు పట్టడానికి వలను ఉపయోగించడం మనకు తెలిసిందే. కానీ ఇక్కడ అదే వలను కోళ్లకు రక్షణగా ఉపయోగించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బంజర పంచాయతీ చిరుతానిపాడులోని గొత్తికోయలు పనుల నిమిత్తం బయటకు వెళ్లేటప్పుడు ఇళ్లలోని కోళ్లు, వాటి పిల్లలను ఇతర జంతువుల నుంచి రక్షించేందుకు ఇలా చేపల వల ఏర్పాటుచేస్తారు! దీంతో వారు తిరిగి వచ్చేవరకు ఏ జంతువుల బారిన పడకుండా కోడి పిల్లలు ఉంటున్నాయని వారు చెబుతున్నారు. - స్టాఫ్ ఫొటోగ్రాఫర్

యువత ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలి



విద్యార్థులకు 'దిక్సూచి' పుస్తకాలు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

అశ్వారావుపేటరూరల్: ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులు ఉద్యోగాలపైనే దృష్టి సారించకుండా.. తామే మరికొందరు నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఐ.వీ.శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. అశ్వారావుపేటలోని ఏజీ కాలేజీలో బుధవారం ఐసీఏఆర్ షెడ్యూల్ కులాల ఉప ప్రణాళికలో భాగంగా విద్యార్థులకు 'ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్' (వ్యవస్థాపకత అభివృద్ధి) అంశంపై బుధవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ యువతీ, యువకులు వినూత్న ఆలోచనలతో వ్యవసాయంపై దృష్టి సారించి వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను స్థాపిస్తే వందలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పించవచ్చని తెలిపారు. అనంతరం బ్యాంకు రుణాలు, సబ్సిడీలపై డీసీసీబీ మేనేజర్ ఆర్.అనూష, పరిశ్రమల స్థాపనపై శాస్త్రవేత్త డాక్టర్ ఎం.రాంప్రసాద్, డాక్టర్ పి.నీలిమ, వానపాముల ఎరువు తయారీపై డాక్టర్ నాగాంజలి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రియారెడ్డి, డాక్టర్ కె.శిరీష, డాక్టర్ వెంకన్న, కె.కోటేశ్వరరావు, డాక్టర్ ఐ.కృష్ణతేజ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు 5న పరీక్ష

ఉదయం ఇంటర్, మధ్యాహ్నం డిగ్రీ పరీక్ష

ఖమ్మంమయూరిసెంటర్/పాల్వంచ రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి ఈనెల 5న పరీక్ష నిర్వహిస్తున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ కె.ప్రత్యూష ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తెలంగాణ గురుకుల సొసైటీ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఇంటర్ ప్రవేశపరీక్ష 5వ తేదీన ఉదయం 10నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని, విద్యార్థులు 9గంటల వరకు చేరుకోవాలని తెలిపారు. అలాగే, మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 5గంటల వరకు జరిగే డిగ్రీ ప్రవేశ పరీక్షకు ఒంటి గంటలోగా కేంద్రాలకు రావాలని పేర్కొన్నారు. కాగా, ఇంటర్ ప్రవేశపరీక్షకు ఖమ్మంలోని డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ జూనియర్ కళాశాల, దానవాయిగూడెం, నేలకొండపల్లి, టేకులపల్లి, తిరుమలాయపాలెం(బొమ్మ ఇంజనీరింగ్ కాలేజీ), వైరా, ఎర్రుపాలెం, కల్లూరు, అడవిమల్లెల, సత్తుపల్లి, కూసుమంచి(ఎస్‌బీసీఈ కాంప్లెక్స్, మద్దులపల్లి), డిగ్రీ కళాశాల ఖమ్మం(ఎస్‌బీసీఈ కాంప్లెక్స్, మద్దులపల్లి), కారేపల్లి(కవిత ఇంజనీరింగ్ కళాశాల)తో పాటు భద్రాద్రి జిల్లాలోని పాల్వంచ బాలుర, బాలికల గురుకుల కళాశాల, అన్నపురెడ్డిపల్లి, దమ్మపేట, ములకలపల్లి, మణుగూరు, అనుబోసు ఇంజనీరింగ్ కళాశాలల్లో కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు ఆర్‌సీఓ తెలిపారు. ఇక డిగ్రీ ప్రవేశ పరీక్షకు ఖమ్మం జిల్లాలోని టేకులపల్లి, దానవాయిగూడెం, ఎర్రుపాలెం, ముదిగొండ(బొమ్మ ఇంజనీరింగ్ కళాశాల ఖమ్మం), మహిళా డిగ్రీ కళాశాల ఖమ్మం(ఎస్‌బీసీఈ కాంప్లెక్స్, మద్దులపల్లి), భద్రాద్రి జిల్లా పాల్వంచలోని బాలుర, బాలికల గురుకుల కళాశాల, మహిళా డిగ్రీకళాశాల, అనుబోసు ఇంజనీరింగ్ కళాశాలలో కేంద్రాలు ఏర్పాటుచేశామని వివరించారు.

వైద్యం వికటించిందని బంధువుల ఆందోళన



రమేష్ బంధువులతో మాట్లాడుతున్న ఎస్సై రవి

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేయించిన చికిత్స వికటించి ఆరోగ్యం విషమించిందని ఆరోపిస్తూ ఓ వ్యక్తి బంధువులు బుధవారం ఆందోళనకు దిగారు. వివరాలు... కురవి మండలం కందికొండకు చెందిన బత్తుల రమేష్‌కు గత నెల 11న కడుపు నొప్పి రావడంతో మహబూబాబాద్‌లోని ఆయుష్ ఆస్పత్రిలో చేర్పించారు. దీంతో డాక్టర్ నన్నపనేని అంజన్‌కుమార్ కడుపులో పేగు ముడతపడిందని చెబుతూ ఆయన వెంట ఉన్న ఇద్దరి అనుమతితో ఆపరేషన్ చేశాడు. ఐదు రోజుల పాటు ఆస్పత్రిలోనే చికిత్స అందించినా నయం కాకపోవడంతో ఫిబ్రవరి 17న హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. ఆయన సూచన మేరకు నిమ్స్‌కు తీసుకెళ్లి చికిత్స చేయిస్తున్నారు. ప్రస్తుతం రమేష్ పరిస్థితి విషమంగా మారిందని నిమ్స్ వైద్యులు చెప్పడంతో ఆయన కుటుంబీకులు బుధవారం మహబూబాబాద్‌కు వచ్చి వైద్యుడి నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై వైద్యుడు అంజన్ కుమార్‌ను మాత్రం కుటుంబ సభ్యులకు రమేష్ పరిస్థితి వివరించాకే శస్త్రచికిత్స చేశానని, చికిత్సలో ఎలాంటి లోపం లేదని తెలిపారు. ఇదే విషయమై బాధితుడి సోదరుడు వీరన్న ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవి తెలిపారు.